ఆదరణ అమోఘం

- వినియోగదారులతో కంచరపాలెం రైతుబజార్ కళకళ
- రోజుకు 4 వేల మంది రాక
- నిర్ణీత ధరలకే కూరగాయల విక్రయాలు
- ఉదయం, సాయంత్రం వేళల్లో నిర్వహణ



రైతుబజార్ ధరల పట్టిక



కంచరపాలెం రైతుబజార్‌లో కూరగాయలు విక్రయిస్తున్న రైతులు

కంచరపాలెం: కంచరపాలెం రైతుబజార్‌కు ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోంది. ఉదయం, సాయంత్రం వేళల్లో నిర్వహించే ఈ రైతుబజార్ వినియోగదారులతో నిత్యం కళకళలాడుతోంది. జీవీఎంసీ 54వ వార్డు కంచరపాలెం బీఆర్‌టీఎస్ రహదారిని అనుకొని ఏర్పాటు చేసిన ఈ రైతుబజార్‌కు 47, 48, 49, 54, 55, 56 వార్డుల్లోని ఊర్వశి కూడలి, ఐటీఐ జంక్షన్, 104 ఏరియా, జ్ఞానాపురం తదితర ప్రాంతాల నుంచి వినియోగదారులు ప్రతి రోజూ 4 వేల మందికి పైగానే వస్తుంటారు. ఇక్కడ తాజా కూరగాయలతోపాటు ఇతర నిత్యావసర సరకులు సైతం విక్రయిస్తుంటారు. రైతులు, డ్వాక్రా గ్రూప్ మహిళలు, పండ్లు, పూలు, గిరిజన, సూపర్ మార్కెట్, డీసీఎంఎస్, విశాఖ డెయిరీ ద్వారా కూడా స్టాల్స్ ఏర్పాటు చేసి బయట మార్కెట్ కంటే తక్కువ ధరలకే సరకులు విక్రయిస్తున్నారు.

వినియోగదారులకు మేలు

నగర వాసులకు చెంతనే కూరగాయలు, నిత్యావసర సరకులను నిర్ణీత ధరలకు, డిమాండ్ సమయంలో ఉల్లిపాయలు, టమాటాలను సబ్సిడీ ధరలకు అందించాలనేది రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం. కంచరపాలెం రైతుబజార్ నిర్వహణ ద్వారా సుమారు నెలకు రూ.1.85 లక్షల వరకు ఆదాయం వస్తోంది. బయట మార్కెట్‌ల్లో కృత్రిమ కొరత, ధరల దోపిడీ వంటి చర్యలతో ఆర్థిక భారం లేకుండా వినియోగదారులకు మేలు చేయాలనే సంకల్పంతోనే ఈ రైతుబజార్‌ను నిర్వహిస్తున్నారు.

రైతులే విక్రయదారులు

కంచరపాలెం రైతుబజార్‌లో 189 మంది రైతులు నమోదు చేసుకున్నారు. వీరిలో సుమారు 155 మందికి పైగా రైతుబజార్‌కు కూరగాయలు తీసుకొచ్చి విక్రయిస్తుంటారు. గుర్తింపు పొందిన రైతులు ఎటువంటి అద్దె చెల్లించాల్సిన అవసరం లేదు. వారు పండించిన పంటను బజార్‌కు తీసుకొచ్చి నేరుగా వారే వినియోగదారులకు విక్రయించుకునేలా ఇక్కడ ఏర్పాట్లు చేశారు. వినియోగదారులకు నాణ్యమైన, సరైన తూకంతో కూడిన కూరగాయలు అందేలా మార్కెటింగ్ శాఖాధికారులు పర్యవేక్షిస్తున్నారు.

సీసీ కెమెరాల పర్యవేక్షణలో..

రైతుబజార్‌లో దొంగతనాలను అరికట్టేందుకు, వ్యాపారులు వినియోగదారులతో నడిచే తీరును, వాహనాల పార్కింగ్ పర్యవేక్షణకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. చిల్లర దొంగతనాలు జరిగేటప్పుడు దొంగలను పట్టుకునేందుకు సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయి. రాత్రి సమయంలో రైతులు తెచ్చే కూరగాయల మూటలు గతంలో దొంగతనానికి గురయ్యేవి. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి రైతుబజార్‌లో భద్రత కల్పించారు. చక్కటి పార్కింగ్ సదుపాయంతోపాటు జనం రాకపోకలకు వీలుగా రైతుబజార్ వద్ద రెండు ప్రధాన ద్వారాలు ఏర్పాటు చేశారు. కంచరపాలెం రైతుబజార్‌లో అందుతున్న సేవలపై వినియోగదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కంచరపాలెం రైతుబజార్ విశేషాలు

- సుమారు 1.5 ఎకరాల్లో రైతుబజార్ విస్తరించి ఉంది.
- ప్రతి రోజూ ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు రైతుబజార్‌ను నిర్వహిస్తున్నారు.
- మొత్తం 114 స్టాళ్లు, 189 మంది రైతులు ఉన్నారు.
- ఉదయం బజార్ రైతుల సంఖ్య 118, సాయంత్రం బజార్ రైతుల సంఖ్య 71.
- ప్రతి మంగళవారం రైతుబజార్‌కు సెలవు.
- సీసీ కెమెరాల సంఖ్య: 16 డీవీఆర్.



రైతుబజార్‌లో సీసీ కెమెరా

తాజా కూరగాయలు లభ్యం



కంచరపాలెం రైతుబజారులో ఉదయం, సాయంత్రం వేళల్లో తాజా కూరగాయలు లభ్యమవుతున్నాయి. మార్కెట్ శాఖాధికారులు నిర్ణయించిన ధరలకే రైతులు కూరగాయలు విక్రయిస్తున్నారు. దళారుల బెడద తప్పింది.

– త్రినాథమ్మ, ధర్మానగర్

సౌకర్యాలు కల్పించాం



కంచరపాలెం రైతుబజార్‌లో కూరగాయలు, నిత్యావసర సరకులు అందుబాటులో ఉండేలా చూస్తున్నాం. ధరల పట్టిక, టాయిలెట్స్, పార్కింగ్, పరిశుభ్రతపై నిత్యం పర్యవేక్షణ ఉంటుంది. వినియోగదారులకు నిర్ణీత ధరలకు కూరగాయలు విక్రయించని రైతులపై చర్యలు తీసుకుంటున్నాం. సీసీ కెమెరాల ఏర్పాటుతో రైతులకు, వినియోగదారులకు ఎంతో మేలు జరుగుతోంది.

– సిహెచ్.కృష్ణమూర్తి, ఎస్టేట్ ఆఫీసర్

పార్కుల్లో కె.కె.రాజు ప్రచారం



స్నేహర్ పార్కులో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు

సీతమ్మధార: వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు మంగళవారం 14, 24 వార్డుల్లోని సీతమ్మధార, టీపీటీ కాలనీ, నార్త్ ఎక్స్‌టెన్షన్ ప్రాంతాల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్పొరేటర్లు కె.అనిల్‌కుమార్‌రాజు, సాడి పద్మారెడ్డితో కలిసి స్నేహర్ పార్కులో వాకర్స్‌తో ఆయన ముచ్చటించారు. ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని అభ్యర్థించారు. ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరించి, చిన్నారులతో కలిసి సందడి చేశారు. వాకర్స్ సానుకూలంగా స్పందించారు. టీపీటీ కాలనీలోని బృందావనం పార్కులో కె.కె.రాజు ప్రచారం చేశారు. ప్రతి ఒక్క వాకర్‌తోపాటు క్రీడాకారులు, యువతీ, యువకులను కలిసి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. వారంతా కె.కె.రాజుకే ఓటు వేస్తామన్నారు. కార్యక్రమంలో హరి వర్మ, కోడూరి పాటి శ్రీను, ప్రవీణ్‌వర్మ, సెక్యూరిటీ శ్రీను, అంబటి శైలేష్, బల్లా శ్రీను, ఎం.సునీల్‌కుమార్, గుడ్ల ఆశోక్‌రెడ్డి, వెంకటేష్, కె.సత్యనారాయణ, బొట్టారాజు, నవీన్ లోకేష్, పార్కు అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రత్యేక బృందాల ఏర్పాటు



తహసీల్దార్ కార్యాలయంలో పోలీసులు

సీతమ్మధార: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం డిప్యూటీ కలెక్టర్, ఉత్తర నియోజకవర్గ ఎన్నికల అధికారి డి.అఖిల ఏడు ప్రత్యేక బృందాలు(ఫ్లైయింగ్ స్క్వాడ్) ఏర్పాటు చేశారు. ఈ బృందాల్లో ఉన్న పోలీసులు, ఫొటో, వీడియోగ్రాఫర్లు, రెవెన్యూ సిబ్బంది కలిసి పలు ప్రాంతాల్లో పర్యటించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీరామమూర్తి, డిప్యూటీ తహసీల్దార్ త్రినాథ్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

అబ్బురపరిచిన విన్యాసాలు



మంటలు ఆర్పుతున్న వలంటీర్



బహుళ అంతస్తుల నుంచి క్షతగాత్రులను కిందికి దించుతున్న వలంటీర్లు

సీతంపేట: ప్రపంచ పౌర రక్షణ దినోత్సవం సందర్భంగా మంగళవారం శాంతిపురంలోని పౌర రక్షణ సంస్థ కార్యాలయంలో శిక్షణ పొందుతున్న 228 బ్యాచ్ వలంటీర్ల పాసింగ్ అవుట్ పెరేడ్ నిర్వహించారు. ముఖ్య అతిథులు రీజనల్ ఫైర్ ఆఫీసర్ వై.హనుమంతరావు, జిల్లా ఫైర్ ఆఫీసర్ ఎస్.రేణుకయ్య శిక్షణ పొందిన 50 మంది వలంటీర్లకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా వలంటీర్లు ప్రదర్శించిన విన్యాసాలు అబ్బురపరిచాయి. అగ్నికీలలను అదుపు చేయడం, మంటలను ఆర్పివేయడం, బహుళ అంతస్తుల నుంచి పౌరులు, క్షతగాత్రులను తాళ్ల సాయంతో కిందకు దించడం వంటి సాహస విన్యాసాలను ప్రదర్శించారు. ఉప పౌరరక్షణ అధికారి కె.పద్మలత మాట్లాడుతూ శిక్షణ పొందిన వలంటీర్లు అత్యవసర పరిస్థితుల్లో సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావడానికి సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో విశ్రాంత వైద్య ఆరోగ్య శాఖాధికారి పి.రామారావు, అగ్నిమాపక సిబ్బంది, వైద్య సిబ్బంది, పోలీస్, కమ్యూనికేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

'పది' పరీక్షలకు 99 శాతం హాజరు



విశాఖ విద్య : పదో తరగతి పరీక్షలకు మంగళవారం 99.22 శాతం హాజరు నమోదైంది. జిల్లాలో 138 కేంద్రాల్లో పదో తరగతి సెకండ్ లాంగ్వేజ్(హిందీ/ సంస్కృతం) పరీక్ష జరిగింది. 28,446 మంది విద్యార్థులు నమోదు చేసుకోగా, వీరిలో 28,223 మంది హాజరయ్యారు. 223 మంది గైర్హాజరైనట్లు డీఈవో ఎల్.చంద్రకళ తెలిపారు. జిల్లా పరిశీలకుడు, విద్యాశాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకుడు బి.విజయభాస్కర్ జిల్లాలోని ఐదు పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. కేంద్రాల్లో విద్యార్థులకు చేసిన ఏర్పాట్లు, పరీక్షల నిర్వహణకు సంబంధించి చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంట్ అధికారులకు పలు సూచనలు చేశారు. మధ్యాహ్నం జరిగిన ఓపెన్ టెన్త్ పరీక్షకు 78 మంది, ఇంటర్మీడియెట్ పరీక్షకు 508 మంది హాజరయ్యారు. ఎటువంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని డీఈవో వెల్లడించారు.

ఆశ్రమ పిల్లలకు వితరణ



పిల్లలకు పుస్తకాలు అందజేస్తున్న మహిళా వాకర్స్ క్లబ్ సభ్యులు

మద్దిపాలెం: మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో అనాథ చిన్నారులకు ఆర్థిక సాయంతోపాటు అన్నదానం నిర్వహించారు. క్లబ్ సభ్యురాలు యోగిత మనవడు జాయ్ మొదటి పుట్టిన రోజు సందర్భంగా క్లబ్ అధ్యక్షురాలు లలితారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం మద్దిపాలెం హైవే దరి జనరేషన్ యువ అనాథ బాలల ఆశ్రమంలోని చిన్నారులకు భోజనం అందించారు. పిల్లలకు అవసరమైన సబ్బులు, చాక్లెట్లు, పుస్తకాలు వంటివి కొనుగోలు చేయడానికి రూ.5 వేల ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు లక్ష్మి, కమల, మాధవి, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ సుభాషిణి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

21న విద్యుత్ సరఫరాకు అంతరాయం

సీతమ్మధార: ఏపీ ట్రాన్స్‌కో గాజువాక 132 కేవీ టవర్ లైన్ల మార్పు కోసం అశీలమెట్ట సెక్షన్ ఆఫీస్, సీతమ్మధార సబ్ డివిజన్ పరిధిలోని 11 కేవీ సీతంపేట ఫీడర్, 11 కేవీ శాంతిపురం ఫీడర్లకు సంబంధించి గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని జోన్-1 ఈఈ బి.సింహాచలం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు గురుద్వారా, సీతంపేట, శాంతిపురం, జీవీకే ప్లాజా, రమా హాస్పిటల్, సీతంపేట మెయిన్ రోడ్డు, దుర్గాగణపతి ఆలయ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

రోడ్డెక్కిన మురుగునీరు



నక్కవానిపాలెం మెయిన్ రోడ్డులో లీకవుతున్న యూజీడీ మ్యాన్‌హోల్

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెం ఇందిరాగాంధీ పార్కు ఎదురుగా ప్రధాన రహదారిలోని యూజీడీ మ్యాన్‌హోల్స్ లీకై మురుగు నీరు పొంగిపొర్లుతోంది. మురుగు, వ్యర్థాలు రోడ్డుపైన ప్రవహించడంతో పాదచారులు, వాహన చోదకులు రాకపోకల సమయంలో ఇబ్బంది పడుతున్నారు. రోడ్డెక్కిన మురుగు నుంచి భరించలేని దుర్వాసన వెలువడుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ యూజీడీ విభాగం అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కమ్యూనిటీ హెల్త్ ఆర్గనైజర్లకు శిక్షణ



కరపత్రాలు, బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: మంచి జీవనశైలితోనే ఆరోగ్యం పదిలమని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. జిల్లా స్థాయి కేర్ కంపానియన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం రేసవానిపాలెం డీఎంహెచ్‌వో కార్యాలయంలో కమ్యూనిటీ హెల్త్ ఆర్గనైజర్లకు నిర్వహించిన శిక్షణలో ఆయన మాట్లాడారు. ప్రజలు ఆరోగ్యంగా ఉండేందుకు తగు సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. జీవనశైలి సరిగా లేకపోవడం వల్ల వచ్చే వ్యాధులను నివారించడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా వివిధ వ్యాధులపై అవగాహన కల్పిస్తూ రూపొందించిన బ్రోచర్, వాల్‌పోస్టర్, బ్యాగ్‌లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నోడల్ అధికారి డాక్టర్ ఉమావతి, వైద్యులు బాలాజీ, శ్రీనివాస్, రవిశంకర్, కమ్యూనిటీ హెల్త్ ఆర్గనైజర్ సాంబమూర్తి పాల్గొన్నారు.

శోభన్‌బాబు చిత్ర గీతాల విభావరి రేపు



సంగీత విభావరి పోస్టర్ ఆవిష్కరిస్తున్న కంచర్ల అచ్యుతరావు తదితరులు

డాబాగార్డెన్స్: ఈ నెల 21న నటభూషణ్ శోభన్‌బాబు వర్ధంతిని పురస్కరించుకుని శోభన్‌బాబు చిత్ర గీతాలతో సినీ సంగీత విభావరి నిర్వహించనున్నట్టు ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక కార్యదర్శి చెన్నా తిరుమలరావు తెలిపారు. డాబాగార్డెన్స్‌లోని సంస్థ కార్యాలయంలో మంగళవారం సినీ నిర్మాత, ఉపకార్ సేవా ట్రస్ట్ చైర్మన్ కంచర్ల అచ్యుతరావు చేతుల మీదుగా కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తిరుమలరావు మాట్లాడుతూ కుటుంబ కథా చిత్రాల కథానాయకుడు శోభన్‌బాబు స్మారకార్థం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించనున్న సినీ సంగీత విభావరిలో ప్రముఖ గాయకులు ప్రజాదరణ పొందిన గీతాలు ఆలపించనున్నారని చెప్పారు. శోభన్‌బాబు వీరాభిమాని కోడూరు కనకరాజుకు శోభన్‌బాబు స్మారక పురస్కారాన్ని ప్రదానం చేయనున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షుడు బొమ్మిడి సత్యనారాయణ, సహాయ కార్యదర్శి ఇందిరా సాహిత్ తదితరులు పాల్గొన్నారు.


సెమినార్ ప్రొసీడింగ్స్ పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఏయూ వీసీ ప్రసాదరెడ్డి

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం జాగ్రఫీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన అర్బన్ డెవలప్‌మెంట్, ఎన్విరాన్‌మెంట్ ఇన్ 21 సెంచరీ–ఇష్యూస్ అండ్ ఛాలెంజెస్ సదస్సు ప్రొసీడింగ్స్ పుస్తకాన్ని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి ఆవిష్కరించారు. ఇటీవల విభాగం ఆధ్వర్యంలో ఐసీఎస్ఎస్ఆర్ సహకారంతో నిర్వహించిన రెండు రోజుల సదస్సులో భాగంగా భూవిజ్ఞాన శాస్త్ర ఆచార్యులు, శాస్త్రవేత్తల ప్రసంగాలను పుస్తకంలో ప్రచురించారు. కార్యక్రమంలో ఆచార్య టి.వి.కృష్ణ, రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, ఆచార్య హేమమాలిని, పి.సునీత, అనూజ టిగ్గ తదితరులు పాల్గొన్నారు.

నిర్ణయించిన ధరలకే విక్రయించాలి



కూరగాయల నాణ్యతను పరిశీలిస్తున్న మార్కెటింగ్ అధికారి షేక్ యాసిన్

విశాఖ విద్య: రైతుబజార్‌లో నిర్ణయించిన ధరలకే సరకులు విక్రయాలు జరుపాలని వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ అధికారి షేక్ యాసిన్ సూచించారు. మద్దిపాలెం రైతుబజార్‌లో మంగళవారం ఆయన తనిఖీలు చేశారు. రైతు బజార్‌లోని ప్రతీ దుకాణం వద్దకు వెళ్లి వారు విక్రయిస్తున్న సరుకులను పరిశీలించారు. బోర్డులపై రాసిన విధంగా నిర్ణయించిన ధరలకు కూరగాయలు, ఇతర నిత్యావసరాలు అమ్ముతున్నారా, లేదా అని వినియోగదారులను అడిగి తెలుసుకున్నారు. కూరగాయలు, ఫ్రూట్స్ దుకాణాలు కేటాయించిన చోటే నిర్వహించాలని సూచించారు. తాజా కూరగాయలు అందించేలా తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. రైతులతో పాటు వినియోగదారులకు తగిన సౌకర్యాలు కల్పించేలా శ్రద్ధ తీసుకోవాలని ఈవో కొమ్మనాపల్లి వరహాలుకు సూచించారు.

సీనియర్ వాకర్ విజయానంద రావు మృతికి సంతాపం

మురళీనగర్: వాకర్స్ క్లబ్ సీనియర్ సభ్యుడు పి.వి జయానందరావు(91) మృతికి వాకర్స్ క్లబ్ సభ్యులు తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. ఆయన ఢిల్లీలో తన కుమార్తె ఇంటి వద్ద సోమవారం రాత్రి అకస్మాత్తుగా మరణించారు. ఈ విషయం తెలుసుకున్న మురళీనగర్ వాకర్స్ క్లబ్ సభ్యులు విచారం వ్యక్తం చేశారు. క్లబ్ అధ్యక్షుడు వల్లా చంద్రమౌళి ఆధ్వర్యంలో మంగళవారం సభ్యులు సంతాపం తెలిపి విజయానందరావు కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. సీనియర్ సభ్యుడిని కోల్పోయామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన లేని లోటు తీర్చలేనిదని పలువురు అన్నారు. బ్రిటిష్ ఇండియా కంపెనీలో విజయానందరావు పనిచేసి పదవీ విరమణ పొందారు. ఆంగ్ల భాషలో మంచి ప్రావీణ్యం కలిగి ఉండేవారు. స్వాతంత్ర్యోద్యమ కాలం నాటి పరిస్థితులను స్థానికులకు ఆయన వివరించేవారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరిగిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు, ఆలయ కార్యనిర్వహణాధికారి పి.శ్రీనివాసులరెడ్డి, ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

- దేవస్థానంలో ఈ నెల 23న సహస్ర తులసీదళార్చన నిర్వహించనున్నామని ఆలయ ఈవో శ్రీనివాసులరెడ్డి తెలిపారు. రూ.1,500 రుసుం చెల్లించిన దంపతులు ఈ పూజలో పాల్గొనవచ్చని చెప్పారు.

యోగసిద్ధాంజనేయుడికి అర్చనలు



సామూహిక సుందరకాండ పఠిస్తున్న మహిళలు

మురళీనగర్: జాతీయ రహదారి సూర్యానగర్-2లో వెలసిన యోగసిద్ధాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు శ్రీకాంత్ ఆచార్యులు ఆధ్వర్యంలో పాంచరాత్ర ఆగమ సంప్రదాయంలో యోగసిద్ధాంజనేయుడికి, ఉత్సవ మూర్తికి సింధూరార్చన, తమలపాకులతో అర్చన వైభవంగా నిర్వహించారు. ధూప, దీప నైవేద్యంతోపాటు స్వామికి మంత్రపుష్పాలు సమర్పించారు. అనంతరం సీతారామాచార్యుల మంగళా శాసనంతో ఆలయ ప్రాంగణంలో స్వపంతి మాతృమండలి ఆధ్యాత్మిక మహిళా సేవా సంస్థ వ్యవస్థాపకురాలు ఆర్.వి.సూర్యకుమారి సారథ్యంలో సంస్థ సభ్యులు సామూహికంగా సుందరకాండ, విష్ణు సహస్రనామం, హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకుడు పెనుమత్స సుబ్బరాజు, ఆధ్యాత్మిక వేత్త ఎంపీ రాజశేఖర్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సింహగిరిపై విశేష పూజలు



ప్రధాన కలశంతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు

సింహాచలం: పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని సింహగిరిపై గంగధార సమీపంలోని ప్రాచీన రామాలయంలో మంగళవారం హోమం విశేషంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని మండపంలో సీతరామలక్ష్మణ సమేత ఆంజనేయ స్వామి ఉత్సవమూర్తులను అధిష్టంపజేశారు. హోమ గుండం వద్ద విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, మండపారాధన, కలశారాధన, అగ్నిప్రతిష్ఠ, హోమం, పూర్ణాహుతి ఘనంగా నిర్వహించారు. అనంతరం కుంభప్రోక్షణ జరిపారు. హోమంలో ఉంచిన ప్రధాన కలశాన్ని ఆలయ అర్చకుడు శిరస్సుపై పెట్టుకుని తిరువీధిగా ఆలయంలోకి తీసుకెళ్లి స్వామివారి మూలవిరాట్‌కు సమర్పించారు. అర్చకులు చిన్నా తదితరులు హోమం నిర్వహించారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి సతీసమేతంగా కార్యక్రమంలో పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 20 మందికి జరిమానా

మద్దిపాలెం: కంచరపాలెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు రోజులుగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించి పలువురికి జరిమానాలు విధించారు. కంచరపాలెం మెట్టు, బర్మా క్యాంప్ జంక్షన్, బిర్లా కూడలి ప్రాంతాల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి మద్యం తాగి వాహనాలు నడిపిన 20 మందికి జరిమానాలు విధించినట్టు సీఐ ప్రసాదరావు తెలిపారు. తనిఖీల్లో పట్టుబడిన ఒక్కొక్కరికీ రూ.4 వేల నుంచి రూ.11 వేల వరకు మొత్తం రూ.1.38 లక్షలను 5వ స్పెషల్ మెట్రోపాలిటన్ కోర్టు మంగళవారం జరిమానా విధించినట్టు ఆయన చెప్పారు.

22న మహిళలకు ప్రత్యేక ఆయుర్వేద శిబిరం

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం యోగ కేంద్రం, ధాన్ ఆయుర్వేద రీసెర్చ్ డెవలప్‌మెంట్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 22న మహిళలకు ప్రత్యేక ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు యోగా కేంద్రం సంచాలకులు ఆచార్య కె.రమేష్ బాబు తెలిపారు. గర్భాశయ క్యాన్సర్ నివారించే విధంగా మహిళలకు అవసరమైన సూచనలు, ఆరోగ్య విధానాలను ఈ శిబిరంలో సూచిస్తారు. యోగా విలేజ్‌లోని ఈ క్లాస్‌రూమ్‌లో మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుంది. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు డాక్టర్ నిషితను 7702682345 నంబరులో సంప్రదించాలని సూచించారు.